RNI NO.TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి
దినపత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మన ప్రజా ప్రతినిధి దినపత్రికకు, టీ.వి ఛానల్ కు జిల్లాల వారీగా, స్టాఫ్ రిపోర్టర్ మరియు మండలాలకు రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను అనుభవం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
7382966665
7382566600

ఎడిటర్ : జి.శ్రీనివాస్ సంపుటి : 2 సంచిక : 166 గురువారం, ఏప్రిల్ 17 2025, పేజీలు - 4 వెల : 2/-
https://epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM : TELANGANA / ANDHRAPRADESH

## రెండు రకాల గుర్రాలు..
### గుజరాత్‌లో కాంగ్రెస్ వ్యూహంపై రాహుల్



**మోడాసా:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బీజేపీ ఓడించగలిగే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నైతికస్థైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్నప్పటికీ రాష్ట్రంలో వాళ్లను (బీజేపీ) ఓడిస్తామని పార్టీ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రెండ్రోజుల పర్యటనకు బుధవారంనాడిక్కడ వచ్చిన రాహుల్ గాంధీ మోడాసాలో జరిగిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సదస్సులో పాల్గొన్నారు. పార్టీ వ్యూహాలను వివరిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.గుజరాత్‌లో పార్టీని పునర్వ్యవస్థీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రస్తావిస్తూ, దీనిపై చాలా నెలలుగా పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటమని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు.

# తెలంగాణ రైతులకు ప్రభుత్వం కీలక అప్డేట్..

**హైదరాబాద్ :**తెలంగాణ ప్రభుత్వం రైతులకు కీలక అప్డేట్ ఇచ్చింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిద్ధం చేసిన భూ భారతి ప్రాజెక్టు ను తొలుత పైలెట్ ప్రాజెక్టుగా అమలుకు నిర్ణయించింది. రేపు (గురువారం) ఈ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం కానుంది. ఈ చట్టం ద్వారా భూ సంబంధిత సమ స్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించ ‌నుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద తొలుత అమలు తరువాత.. రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయం తీసుకు న్నట్లు పొంగులేటి వివరించారు.తెలంగాణలో భూ భారతి చట్టం ఏప్రిల్ 17 నుంచి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అమల్లోకి రానుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ చట్టాన్ని ప్రారంభించనున్నారు.



ఈ చట్టం ద్వారా రానున్న రోజుల్లో అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించనుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులే టి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టం, భూ ముల సమస్యలను పరిష్కా రానికి ఒక మంచి అవకాశమని మంత్రి తెలి పారు. ఈ చట్టం ద్వారా, భూముల సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



కేసీఆర్ మంచోడు కావచ్చు.. నేను రౌడీ టైపే..
## కవిత మాస్ వార్నింగ్

**హైదరాబాద్ :**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పుట్టించారు. సంచలన వ్యాఖ్యలతో కాకరేపారు. లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లివచ్చినప్పటి నుంచి ఆమె దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు సైతం ఇంతగా యాక్టివ్ లేరనే అభిప్రాయం వినిపిస్తోంది. నిత్యం ప్రజల్లో ఉంటూ ఆందోళనలు, డిమాండ్లు, దీక్షలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

### దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని ఆయన మండిపడ్డారు
## చేసిన తప్పులకు చెంపలేసుకోవాలి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగా యన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు.ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గు మాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. నెహ్రూ



కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని ఆయన మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులో భాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు.చేసిన తప్పులకు చెంపలు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఆయన సూచించారు.

### తెలంగాణ ప్రజలకు మరో
## మూడు రోజులు అలర్ట్



**హైదరాబాద్ :**తెలంగాణ రాష్ట్రంలో భిన్నమైన వాతావ రణం కొనసాగుతోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండగా.. సాయంత్రం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వానలు పడుతున్నాయి. తాజాగా మరి కొన్ని రోజులు ఇదే వాతావరణం కొనసాగే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇదే సమయంలో కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, మరికొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తాజా ప్రకటనలో వెల్లడించింది. ఇక, రాగల మూడు రోజులు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## ఊహించని నేతకు ఏపీ బీజేపీ పగ్గాలు



**అమరావతి:**ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. మూడు పార్టీలు కూటమిగా అధికారంలో కొనసాగుతూ సొంతంగా ఎదిగేలా కార్యాచరణ సిద్దం చేసుకుం టున్నాయి. బీజేపీ ఈ సారి దక్షిణాది రాష్ట్రాల పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో బలం పెంచుకోవటానికి ఇదే సరైన సమయంగా పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర నేతలకు పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. అందులో భాగంగా ఏపీ పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకం పైన సుదీర్ఘ కసరత్తు చేసింది. సామాజిక – ప్రాంతీ య సమీకరణాలను పరిగణలోకి తీసుకొని.. చివరగా సీమ ప్రాంతానికి పదవి ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఏపీ నూతన అధ్యక్షుడిగాఏపీ బీజేపీకి కొత్త అధ్యక్షుడు దాదాపు ఖరారయ్యారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ సొంతంగా బలోపేతం కావటం పైన కొత్త ప్రణాళికలు సిద్దం చేస్తోంది. దీంతో, ప్రస్తుతం అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకం పైన పార్టీ నాయకత్వం కసరత్తు చేసింది. రాయలసీమ కు చెందిన సీనియర్ పార్టీ నేతకు రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రధాని మోదీ టీం ఖరారు చేసినట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం పార్టీలోని పలువురు నేతలు పోటీ పడ్డారు. అయితే, తొలి నుంచి పార్టీ కోసం పని చేస్తూ సాధారణ కార్యకర్త నుంచి ఎదిగిన వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది.

### ప్రత్యేక హోదా మరచిన ఏపీ రాజకీయ పార్టీల
## ఆర్థిక సంఘం ముందు నోరెత్తని వైనం

**అమరావతి:**విభజనతో నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంట్ లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటన చేశారు. ముందు ఐదేళ్లు ఇస్తామంటే కాదు పదేళ్లు, పదిహేనేళ్లంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. చివరికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ లో ప్రధాని ప్రకటించారు. అయితే ఆ తర్వాత కేంద్రంలో యూపీఏ స్థానంలో వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం దీన్ని పూర్తిగా మర్చిపోయింది.గతంలో టీడీపీతో కలిసి ఏపీలో, కేంద్రంలో అధికారం పంచుకున్న ఎన్డీయే నేతలు ప్రత్యేక హోదాను ఉద్దేశపూర్వకంగానే పక్కనబెడుతూ వచ్చారు. కానీ రాష్ట్రంలో అప్పట్లో విపక్షంలో ఉన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ పోరు పెట్టడంతో ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని



ప్రధాని మోడీ ప్రకటించడం, దాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు అంగీకరించడం చకచకా జరిగిపోయాయి. అయితే దీన్ని ఏపీ ప్రజలు అంగీకరించలేదు. ఇదే అదనుగా తమకు 25 మంది ఎంపీలిస్తే ప్రత్యేక హోదా సాధిస్తానంటూ జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అయినా పరిస్థితిలో మార్పేమీ లేదు. మరో ఐదేళ్లు గడిచిపోయాయి. అప్పటికే ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అం టూ పదే పదే చెప్పుకొచ్చిన బీజేపీకి వంత పాడుతూ ఏపీలో రాజకీయ పార్టీలు కూడా ఈ డిమాండ్ ను పూర్తిగా పక్కనబెట్టేశాయి. మొదట్లో 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాకు సిఫార్సు చేయలేదని చెప్పుకున్న కేంద్రం... ఆ తర్వాత 15వ ఆర్థిక సంఘం క్లారిటీ ఇచ్చినా హోదా ఇచ్చేందుకు మాత్రం అం గీకరించలేదు. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం కూడా వచ్చేసింది. రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం సభ్యులకు రెడ్ కార్పెట్ పరిచిన చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక హోదా మినహా అన్నీ అడిగింది. అదే బాటలో కూటమి పార్టీలు, విపక్ష పార్టీలు కూడా నడిచాయి.రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలంటే సవాలక్ష నిబంధనలు ఉన్నాయంటూ చెబుతూ వస్తున్న కేంద్రం.. అప్పట్లో ఏ ధైర్యంతో ప్రత్యేక హోదా ఇస్తామని ఏపీకి హామీ ఇచ్చిందంటే జవాబు దొరకదు.

### తెలంగాణ సర్కార్‌కు సుప్రీంకోర్టు చురకలు
# తక్షణ చర్యలకు ఆదేశాలు



**హైదరాబాద్ :** దేశ అత్యున్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇందులో జోక్యం చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వానికి మరో విడత కీలక ఆదేశాలను జారీ చేసింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల అటవీ భూమిలో కొద్దిరోజుల కిందట చెట్ల నరికివేత విస్తృతంగా కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. ఫలితంగా అక్కడ తలదాచుకుంటోన్న వణ్యప్రాణులు, పక్షులు ఆశ్రయాన్ని కోల్పోయాయంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.హెచ్‌సీయూ విద్యార్థులు కొన్ని రోజులుగా నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. తరగతులను బహిష్కరించారు. చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారు. వణ్యప్రాణులు తమ ఆవాసాలను కోల్పోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి వారి ఆందోళనలు కొనసాగాయంటే దాని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.ఈ పరిణామాల మధ్య సుప్రీంకోర్టు రంగంలోకి దిగింది. 400 ఎకరాల అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత అంశం సుప్రీంకోర్టు సమక్షానికి వచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది దేశ అత్యున్నత న్యాయస్థానం. మధ్యంతర నివేదికను అందజేయ‌ాలంటూ తెలంగాణ హైకోర్టును గతంలో ఆదేశించింది.ఇప్పుడు దానికి కొనసాగింపుగా మరోసారి ఆదేశాలను ఇచ్చింది. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల భూమిలో అటవీ నిర్మూలన కారణంగా ప్రభావితమైన వన్యప్రాణుల స్థితిగతులపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక అందజేయాలంటూ తెలంగాణ అటవీ మంత్రిత్వ శాఖను ఆదేశించింది.ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్, జస్టిప్ మసీతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అలాగే– చెట్ల నరికివేత వల్ల ఆవాసాలను కోల్పోయిన వణ్యప్రాణులను రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు అటవీ మంత్రిత్వ శాఖ వణ్యప్రాణుల సంరక్షణ విభాగం వార్డెన్‌కు ఈ ఆదేశాలను ఇచ్చింది.తక్షణమే ఆ అటవీ జంతువుల స్థితిని పరిశీలించాలని, వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని పేర్కొంది.

### కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీం
## ఆదేశాలను స్వాగతించిన కెటిఆర్



**హైదరాబాద్ :** కంచ గచ్చిబౌలి భూములపైన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. అలాగే కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అందరూ అభినందిం చాలన్నా రు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమన్నారు. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం ఇదన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఊతం ఇస్తాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు కెటిఆర్ . 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడి, హైదరాబాద్ భవిష్యత్తు కోసం నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల కృతజ్ఞతలు చెప్పారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నదన్నారు.

## చేర్యాల పట్టణంలో ఎస్ ఎం కె బ్రాండ్ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా



**మనప్రజాప్రతినిధి //చేర్యాల, జనగామ:**చేర్యాల పట్టణంలో దుల్మిట్ట గ్రామానికి చెందిన మని సాయి, అంజు శర్మలు కొత్తగా ఏర్పాటుచేసిన ,ఎస్ ఎం కె బ్రాండ్ స్టోర్ ప్రారంభోత్సవానికి జనగామ శాసన సభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఆ భగవంతుని దయవల్ల మీ వ్యాపారం అభివృద్ధి దిశలో సాగాలని కాంక్షించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారుం

## బాధిత కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్



**మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :**పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో భాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన ఏఎస్సై యండీ. సౌకత్ అలీ కుటుంబ సభ్యులకు రూ. 8,00,000/- భద్రత ఎక్సిగ్రేసియా చెక్కు ను శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.కార్యక్రమంలో ఎట చంద్రకళ పాల్గొన్నారు.

## షో రూమ్ ను ప్రారంభించిన బైక్ వినుత కోటా

**-అచ్యుత మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల షో రూమ్ ను ప్రారంభించిన జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా**





**మనప్రజాప్రతినిధి//శ్రీ కాళహస్తి నియోజకవర్గం:**శ్రీకాళహస్తి పట్టణంలో,చెన్నై రోడ్డు సాయిబాబా గుడి పక్కన ఈరోజు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రికల్ 2 వీలర్ వాహనాల షో రూమ్ "అచ్యుత మోటార్స్" యజమానులు ప్రసాద్ , సుజయ్ ల ఆహ్వానం మేరకు విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా వేణు మోటార్స్ కంపెనీకి చెందిన 2 వీలర్ వాహనాలను ఈ షో రూమ్‌లో విక్రయించడం జరుగుతుంది.షో రూమ్ ప్రారంభించిన అనంతరం శ్రీమతి వినుత కోటా గారు మొదటి వాహనం వారి మామయ్య కోసం కొనుగోలు చేశారు షో రూం ప్రారంభించిన అనంతరం వినుత కోటా వాహనాన్ని నడిపారు.ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ వాహనాలు షో రూం ప్రారంభించిన అచ్యుత మోటార్స్ యజమానులు ప్రసాద్,సుజయ్ గార్లకు శుభాకాంక్షలు తెలిపారు.వినుత గారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు అచ్యుత మోటార్ షో రూమ్ లో వాహనాలు కొనుగోలు చేసివారికి సపోర్ట్ చెయ్యాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాలు వాడడం వల్ల పోల్యూషన్ తగ్గుతుందని, పెట్రోల్ వినియోగం కూడా తగ్గుతుందని, తక్కువ ఖర్చుతో ప్రయాణం చెయ్యచ్చని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ ఉప్పల్ :**ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి కుమార్తె వివాహానికి రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక ఈ నెల 20 వ తేదీన జరుగు కుమార్తె వివాహానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక ను కుటుంబ సభ్యులతో కలిసి అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ మాదిగని సన్మానించిన విజయ్



**మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :**క్రియాశీలక పాత్ర పోషించిన లింగంపల్లి శ్రీనివాస్ మాదిగని బుధవారం రోజు కొండపాక కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఘనంగా సన్మానించిన ఎస్సీ సెల్ సిద్దిపేట్ జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ కుమార్ అనంతరం అయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయం కోసం మాదిగ కుల ధ్యేయంగా విద్యార్థి దశ నుంచి సుమారు 24 సంవత్సరాల కాలం మందకృష్ణ మాదిగతో నడిచి ఆయన సూచించిన నాణ్యమైన ప్రతి పోరాటంలో ముందుండి, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన జయంతోత్సవాలలో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు ప్రస్తుత సిద్దిపేట్ జిల్లా ఇన్చార్జిగా పనిచేసిన జాతీయ నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ కు అయన ఉద్యమ నేపథ్యాన్ని గుర్తించిద" దళిత రత్న "అవార్డు వరించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో పెద్దమాతరి బాబు మాదిగ, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు పుట్ల యేసు, కన్వీనర్ పుట్ల ప్రసాద్, పొన్నాల రాజేష్, కన్వీనర్ ముత్యాలు యాదగిరి, సామ్రాట్ ప్రకాష్ మాదిగ ఎంఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, పిన్నింటి శ్రీహరి ఎమ్మెస్పి సీనియర్ నాయకులు, లింగంపల్లి రాకేష్ ఎమ్మెస్పార్ జిల్లా కోకన్వీనర్, బొడ్డు బాలరాజు, కొమ్ము భాను తదితరులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన మత్తడి స్థలం సాధించేంతవరకు పోరాటం ఆగదు...

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో**



**మనప్రజాప్రతినిధి//జనగామ నియోజకవర్గం:**చేర్యాల మండల కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పశువుల అంగడిని లేకుండా చేసిన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి,కుమార్తె పిట్లూరి తుల్జా భవాని రెడ్డి, మరియు కొండగట్ల మారుతి ప్రసాద్, అన్నం జితేందర్ రెడ్డి, ల అక్రమ పట్టాను రద్దు చేయాలని తిరిగి ఈ స్థలాన్ని చేర్యాల మున్సిపాలిటీ కి అప్పగించి పబ్లిక్ అవసరాలకు వినియోగించుకోనేలా చేయాలనే ఉద్దేశంతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి హైదరాబాద్ లోకాయుక్త కోర్టులో న్యాయ విచారణ కోసం కేసు వేసిన దాంట్లో భాగంగా బుధవారం రోజున లోకాయుక్త కోర్టుకు హాజరైన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, చేర్యాల పట్టణ కమిటీ సభ్యులు బోయిని మల్లేశం. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ సిపిఎం పార్టీ చేర్యాల ప్రాంత ప్రజల వైపున నిలచి పోరాడుతుందని ఎన్ని ఇబ్బందులు ,కష్టాలు తలెత్తిన ప్రజల అభిమానంతో, ప్రజల ఆదరణ తో న్యాయాన్ని గెలిపించే విధంగా అవినీతిని అక్రమాల ను అంతం చేసేందుకు సిపిఎం కార్యకర్తలం నిరంతరం పోరాడుతారని అన్నారు. గతంలో తుల్జా భవాని రెడ్డి ఈ స్థలాన్ని మా నాన్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నాపై పట్టా చేయించాడని ఈ స్థలం పశువుల అంగడి మత్తడి స్థలం అని తెలియదని దీనిని ప్రజలకు తిరిగి ఇచ్చేస్తానని వాగ్దానం చేసి వెళ్లిన దానిని నిలుపుకోవాలని చేర్యాల ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేయడం జరిగింది.

# అంబేద్కర్ ని రాజకీయాలకు ముడిపెట్టడం సరి కాదు

**మహనీయులు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ని రాజకీయాలకు ముడిపెట్టడం సరి కాదు. బక్కి వెంకటయ్య-తెలంగాణ రాష్ట్ర ఎస్సి,ఎస్టీ కమిషన్ చైర్మన్**



**మనప్రజాప్రతినిధి//దౌల్తాబాద్:** దౌల్తాబాద్ మండలం ముబ్రస్ పూర్ గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం లో ర్యాలీ అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే క్రమంలో అంబేద్కర్ కి పూలమాలలు వేసే సందర్భంలో ఎమ్మెల్యే చేతిలో ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ జెండాను విగ్రహం కింద ఉన్న దళిత వ్యక్తికి అందుకోమని చెప్పి కిందికి ఇవ్వడం తో ఆ వ్యక్తి పట్టుకోనందున జెండా కింద పడటం జరిగింది ఆ సందర్భాన్ని ఉద్దేశించి పలు రాజకీయ పార్టీలు,పార్టీల నాయకులు రాజకీయాలకు ముడిపెట్టడం సరి కాదు.జెండా కిందకు అందజేసే క్రమం లో ప్రత్యక్ష సాక్షిగా రాష్ట్ర ఎస్సి,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ,దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఉన్నాము ఎం ఎల్ ఏ జండా ను పడేస్తే మేం అక్కడే ఖండించే వారిమీ రాజకీయాల పరంగా ఎం అయిన విమర్శలు అంటే రాజకీయాల మట్టుకే ఉంచి,అంబేద్కర్ ని రాజకీయాలకు ముడిపెట్టడం సరి కాదుదయచేసి ఇంతటి తో ఈ ఘటన ను ఆపాలని కోరుతున్నాను

# ప్రభుత్వంతో కొట్లాడుతా..నిధులు తీసుకవస్తా..





**దూల్మిట లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే డా. పల్లా**

**మనప్రజాప్రతినిధి//జనగామ నియోజకవర్గం:**దూల్మిట్ట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిరంతరం ప్రభుత్వంతో కొట్లాడుతా.. మనకు రావాల్సిన నిధులు తీసుకవస్తానని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.గ్రామంలో బిఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దూల్మిట్ట మండలం జాలపల్లి,, తోర్నాల గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ. 4లక్షల చొప్పున మంజూరు అయినా నిధులతో .సి సి రోడ్డు పనులకు జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పల్లా మాట్లాడుతూ..జనగామ, చేర్యాల తెలంగాణ ప్రాంతం లో ఉంది..మాకు కావాల్సిన వాటా మాకు కచ్చితంగా రావాలి.. అవసరం అయితే సంబందింత మంత్రి దగ్గరికి వెళ్లి అడుగుతా..ఇవ్వకపోతే కొట్లాడుతా..ఇటీవల ఈ ప్రాంతానికి నగేరా నుంచి అధిక నిధులు తీసుక రావడం జరిగింది..నీటి సమస్య కూడా త్వరలోనే పూర్తి అయ్యేలా కృషి చేస్తాను అని అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు

# తెలుగు భాషా పరిరక్షణకు నడుం బిగించిన తెలుగు అధ్యాపకులు



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:**జూనియర్ కళాశాలల్లో తెలుగును పరిరక్షించడానికి తీసుకొనవలసిన చర్యల గురించి చర్చించడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలుగు అధ్యాపకులందరూ నిన్న సాయంత్రం ఖమ్మం, ముస్తఫా నగర్ లోని తెలుగు సీనియర్ అధ్యాపకులు నయీమ్ పాష నివాసంలో సమావేశమయ్యారు. నయీమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ, కేజీబీవీ,సాంఘిక మరియు గిరిజన సంక్షేమ కళాశాలల్లో పనిచేస్తున్న తెలుగు అధ్యాపకులు హాజరయ్యారు. సంస్కృతాన్ని ద్వితీయ భాషగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశపెట్టడాన్ని అందరు అధ్యాపకులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రభుత్వం ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లుగా వారు తెలియజేశారు. ఒక భాషను ప్రవేశపెట్టే క్రమంలో మాతృభాషకు హాని కలిగించటం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మాతృభాష తెలుగును అన్ని జూనియర్ కళాశాలలో తప్పనిసరి చేయాలని అందుకు ఇప్పటవరకు ఇంటర్ లో ద్వితీయ భాషగా ఉన్న తెలుగును ప్రథమ భాషగా మార్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో తెలుగు అధ్యాపకులు అందరూ ఒక కమిటీగా ఏర్పడి ముందుగా స్థానిక ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేయాలని అదేవిధంగా తెలుగు భాష ఔన్నత్యం గురించి మేధావులతో సదస్సులు సభలు సమావేశాలు సెమినార్లు నిర్వహించి విద్యార్థులలో తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో తెలుగు పరిరక్షణ కొరకు తెలుగు భాషా పరిరక్షణ సంఘం ఏర్పాటు. చేసుకున్నామని ముందుగా అడ్ హాక్ బాడీని ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. దీనికి రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీ నయిం పాషాని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా తెలియజేశారు. అదే విధంగా ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీమతి పి సుధారాణి మరియు మోదుగు వెంకట్ ను, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యతలను శ్రీ బండి వెంకటేశ్వరరావు శ్రీధర్ ను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నట్టు వారు తెలియజేశారు. త్వరలో జరగబోయే విస్తృస్థాయి సమావేశంలో పూర్తిస్థాయి రాష్ట్ర %ఒ% జిల్లా కమిటీలను ఎన్నుకొని ఒక మంచి కార్యచరణతో ముందుకు వెళ్తామని నయీమ్ పాష తెలియజేశారు. ఇంటర్లో తెలుగు తప్పనిసరి చేసేవరకు తమ కార్యచరణ వివిధ రూపాల లో ఉంటుందని, అన్ని సంఘాలకతీతంగా అందరి సహాయ సహకారాలను తీసుకుంటూ, యూనివర్సిటీ స్థాయి ప్రొఫెసర్లను, మేధావులను, అన్ని తెలుగు భాషా సంఘాలను, తెలుగు సాహిత్య వేదికలను, తెలుగు భాషాభిమానులను, విద్యార్థుల తల్లిదండ్రుల ను కలుపుకొని ముందుకు వెళ్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో తెలుగు అధ్యాపకులు పి సుధారాణి, మోదుగు వెంకట్, బండి వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఉమాలక్ష్మి, డాక్టర్ వల్లి మేడం రమాదేవి,ఈశ్వర్, శ్రీనివాసరావు, నిర్మల,శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్

**ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ మొదటి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా జన్నావుల సురేంద్ర , అనిల్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎంపిక.**




**మనప్రజాప్రతినిధి//తిరుపతి జిల్లా:**మన తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్ర అధ్యక్షులుగా జన్నావుల సురేంద్ర, మరియు రాష్ట్ర సెక్రటరీగా డిఎన్ఎస్ అనిల్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం సంస్థకు గర్వకారణంగా ఉంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రజా టివి చైర్మన్ మార్ని బాల నరసింహులు పాల్గొన్నారు.ప్రజల హక్కుల కోసం, పారదర్శక పాలన కోసం పోరాడే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నాం.ఈ సందర్భంగా ప్రజలకు ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ ఉపయోగపడే ముఖ్యమైన అంశాలు .ప్రజా సమస్యలపై పారదర్శకత ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా అవినీతిని ఎదుర్కోవడం.హక్కులపై అవగాహన ప్రజలకు తమ హక్కులు, ఆర్.టి.ఐ చట్టం ద్వారా లభించే అవకాశాలపై అవగాహన కల్పించడం.బాధ్యత కలిగిన పాలన ప్రభుత్వ అధికారులు ప్రజలకు సమాధానం చెప్పే విధంగా బాధ్యతతో ఉండేలా చేయడం.సేవలపై నిఘా పబ్లిక్ సర్వీసులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజా పర్యవేక్షణను పెంచడం. బలహీన వర్గాలకు తోడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం.సామాజిక న్యాయం కోసం పోరాటం. అన్ని వర్గాల సామాజిక న్యాయాన్ని సాధించేందుకు కలిసికట్టుగా పనిచేయ డం.తప్పుడు విధానాలపై పోరాటం ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించడం, అవసరమైతే పోరాటంలో ముందుండడం. అభిప్రాయ స్వేచ్ఛకు మద్దతు ప్రజలు భయపడకుండా ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించగల స్వేచ్ఛను సమర్థిం చడం. న్యాయపరమైన సహాయం అవసరమైతే న్యాయస హాయం అందించడంలో తోడ్పాటు.పౌరులచే పౌరుల కోసం ఇది ప్రజల హక్కుల కోసం ప్రజలే నడిపించే ఉద్య మమని గుర్తించి అందరూ భాగస్వాములవ్వాలి.జన్నావుల సురేంద్ర మరియు అనిల్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కొత్త బాధ్యతలో వారి నైతికత, ధైర్యంతో ప్రజల కోసం నిస్వార్థంగా పని చేస్తారని మేము విశ్వసిస్తున్నాం అని వ్యవస్థాపకులు పొన్న రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా టీవీ చైర్మన్ మార్ని బాల నరసింహులు, డాక్టర్ నరసయ్య, హిమగిరి, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజా భరోసా



**మన ప్రజా ప్రతినిది తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:**సూర్యాపేట పట్టణ కేంద్రం తాళ్లగడ్డ నందు పట్టణ పోలీసుల అధ్వర్యంలో ఎస్పి ఆదేశాల మేరకు పోలీసు ప్రజా భరోసాలి కార్యక్రమ నిర్వహించడం జరిగినది. ఎ ఆర్ అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడినారు. పౌరులు చట్టాల పై అవగాహన కలిగి చట్టానికి లోబడి నడుచుకోవాలి అన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది, నేరాలకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవు అన్నారు. , చట్టాన్ని వినయోగించుకోవాలి తెలియ చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో టౌన్ సి ఐ వీర రాఘువులు, ఎస్ ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది, మరియు స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది.

# శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం

**ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు**



**(మన ప్రజా ప్రతినిధి):** లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.042025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి ఇవ్వాలా వీరభద్రస్వామి వారికి విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలాముకుటంతో పదిచేతులతో విశిష్ట రూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి ఆహారవీర భద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారి కి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామి ని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం కాగా ప్రతి బుధవారం ప్రదోష కాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది.ఈ పూజవలని లోకజాంతి, దుర్భనివారణ,భక్తుల అనుదున్న కోరికలు నెరవేరుతాయి.ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది.కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతిపూజరు నిర్వహించబడుతుంది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గందోదకం, భస్మోదకం, పుష్పోదకం, అల్పోదకం హారిర్ణోదకం తోమా మరియు మల్లిక గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుం ది.ఈ అభిషేకాల తరువాతి విశేషంగా స్వామివారికి పుష్పార్చనను ఇరిపించబడుతుంది.

# ఎమ్మెల్సి గా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్ కుమార్

**శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి,మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**





**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:**ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన డిఆర్. దాసోజు శ్రవణ్ కుమార్ ఈరోజు శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిధులుగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు,మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియచేశారు ఈ సందర్భగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్ర

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్**






**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ కీసర:**ఏఐసీసీ పిసిసి పిలుపు మేరకు మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి ఓల్డ్ విలేజిలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ ఎన్ వసంత




**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ జవహర్ నగర్ :**జవహర్ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మునిసిపల్ కార్యలయం వెలుపల బస్ స్టాప్ దగ్గర మండుతున్న ఎండల దృష్ట్యా ప్రజలకు అందుబాటులో ఉండే విధముగా మునిసిపల్ కమీషనర్ ఎన్.వసంత చలివెంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డి ఇ మాధవ చారి,మునిసిపల్ ఆర్ ఓ వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్లు,వార్డు ఆఫీసర్స్ మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బి ఎన్ జి టోర్నమెంట్ లోగో పోస్టర్ని ఆవిష్కరించిన

## మాజీ మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ బిఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి

**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :**బండి నవీన్ గౌడ్ యువసేన ఆధ్వర్యంలో ఈనెల 16 తేదీ నుండి బి.ఎన్.జి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ లోగో పోస్టర్ని మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు.అనంతరం టోర్నమెంట్ పోస్టర్ని మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి ఆవిష్కరించారు.బండి నవీన్ గౌడ్ యువసేన సభ్యులు మాట్లాడు తూ యువతకు క్రీడారంగంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని లక్ష్యంతో బండి నవీన్ గౌడ్ ఆలోచనను అమలు చేస్తూ ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, యువతకు విద్యతోపాటు క్రీడారంగంలోనూ రాణించాలని లక్ష్యంతోనే మా నాయకుడు బండి నవీన్ గౌడ్ నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడమే మా



లక్ష్యం అని పేర్కొన్నారు.టోర్నమెంట్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి ఆశీస్సులతో ముందుకు సాగుతుందని బండి నవీన్ గౌడ్ యువసేన సభ్యులు తెలిపారు.ఏప్రిల్ 16న మాజీమంత్రి



మల్లారెడ్డి,మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టోర్నమెంట్ ప్రారంభమ వుతుందని తెలిపారు. ఆసక్తిగల యువత ఈ టోర్నమెంట్ లో పాల్గొని మీ ప్రతిభను చాటాలని కోరుతూ యువత పెడదారిన పట్టకుండా ఉన్నత స్థాయికి రావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని తెలియజేశారు.

# అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉండాలి

**జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**మన ప్రజాప్రతినిధి/మానకొండూర్ తేదీ 16 ఏప్రిల్:**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం లోని ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలు,స్టేషన్ సంబం ధించిన రికార్డులను,పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాలతో పాటు గతంలో జరిగిన సంఘటనల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, సిబ్బంది నిర్వహించే విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యారుదలపై తక్షణమే స్పందించాలన్నారు. సమస్యను తెలుసు కొని వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు.పెట్రోలింగ్ సమయంలో తప్పని సరిగా రౌడీ,హిస్టరీ షీటర్లతో పాటు



అనుమానిత వ్యక్తుల తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత స్థితిగతులపై అరా తీయాలని,మత్తు పదార్థాలపై, సైబర్ నేరాలపై ముమ్మరం గా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై ,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు.అధికారులకు,సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. ఇల్లంత కుంటపోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ రకల పండ్ల మొక్కలతో ఏర్పాటు చేసిన తోటకు వాటర్ డ్రిపింగ్(బిందు సేద్యం) ప్రారబించి ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,మొక్కలు మానవ జీవ కోటికి ప్రాణధారమని, ప్రతి ఒక్కరూ తమ వంతు భాధ్యతగా నాటిన మొక్కలను ఖచ్చితంగా రక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ మొగిలి, ఎస్.ఐ శ్రీకాంత్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

# జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాం

**టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు రామారావు**

**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ కీసర:**ఏఐసీసీ పీసీసీ పిలుపు మేరకు మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పా రామ రావు ఆధ్వర్యంలో ఆర్జికే కాలనీ లో జై బాపు,జై భీమ్, జై సంవిదాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్ర నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్. ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం



బి బ్లాకు మహిళా అధ్యక్షురాలు ఈగా శ్వేతా రాజు ముదిరాజ్ ,దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు శోభా రాణి,దమ్మాయిగూడ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరేందర్




రెడ్డి,కీసర మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామిడి విజయ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు,మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):**హన్మకొండ ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి, సుందరీ కరణ పనులు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జంక్షన్ అభివృద్ధి, సుందరీ కరణ పనుల పురోగతి గురించి కుడా పీవో అజిత్ రెడ్డి, ఈ ఈ భీమ్ రావు, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. జంక్షన్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జంక్షన్ నిర్మాణం,సుందరీ కరణ పనులు దాదాపు 80% వరకు పూర్తయ్యాయని మిగతా పనులను పది రోజుల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



ఫౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటు, శిల్పాలు, విద్యుత్ లైట్లు, హై మాస్ట్ లైట్లు, సైన్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను కలెక్టర్



పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటు బాగుందని, విజయ వంతంగా క్యాంటీన్ నిర్వహించాలన్నారు. జంక్షన్ నిర్మాణం, సుందరీకరణ పనుల గురించి అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్టు

**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):**రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసివున్న దిచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడి నుండి సుమారు 10 లక్షల విలువ గల 18 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి కాజీపేట ఏసిపి తిరుమల్ వివరాలను వెల్లడిస్తూ బుధవారం ఉదయం హసన్ పర్తి పోలీసులు హసన్ పర్తి మండల కేంద్రంలో వాహన తనీఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి పోలీసులు నిర్వహిస్తున్న తనీఖీ లను గమనించి అక్కడి నుండి తప్పించు కునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని వద్ద ద్విచక్ర వాహనానికి సంబంధించి ఎలాంటి అధారాలు లేకపోవడం పోలీసులు నిందితుడుని విచారించగా జనగామ జిల్లా, చిలుపూర్ మండలం, ఫతేపూర్ గ్రామం, ప్రస్తుతం హనుమకొండ, గోపాల్‌పుర్ లో నివాసం వుంటున్న గుగులోత్ చందులాల్ (24), గత కొద్ది రోజులుగా తనకు డ్రైవింగ్ ల్కెసెన్స్ లేనందున స్నేహితుడి లాగిన్ ఐడీ తో జోమాటో స్విగ్గీ, ర్యాపిడో సంస్థల్లో పని చేస్తున్నాడు. వీటీ ద్వారా వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోక పోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయిస్తే వచ్చే డబ్బు జల్సాలు చేయాలకున్నాడు నిందితుడు తాను అనుకున్న ప్రకారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, కెయూసి పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పరిధిలొ 4, భువనగిరిలో 2, హైదరాబాద్ లో 1 చోప్పున మొత్తం 18 ద్విచక్ర వాహనాలను చోరీ చేసాడు. నిందితుడు చోరీ చేసిన వాహనాలను అవకాశం చూసుకోని విక్రయించేందుకు భద్ర పర్చుకున్నాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తన ఇంటి చోరీ అయిన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లుగా ఏసిపి వెల్లడి పరచారు. నిందితుడిని పట్టుకొని చోరీకి గురైన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమ్, ఏసిపి తిరుమల్, హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ చేరాలు, ఎస్.ఐ లు దేవేందర్, రవి, సిద్దయ్య లు, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ వివేకనంద, కానిస్టేబుళ్ళు క్రాంతి కుమార్, తిరుపతయ్య, భరత్ కుమార్, దేవేందర్, మహేందర్, రమేష్, పూర్ణచారీ, రాజ్





కుమార్, సోమన్న, ధనుంజయ, నాగరాజు, నవీన్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

# రాజీవ్ యువ వికాస్ గడువును పెంచాలి

**బ్యాంకు లింకెజ్ లేకుండా రుణాలు అందించాలి.**
**అంబేడ్కర్ ఆభయాస్తం ను యుద్ధ ప్రాతిపదిక అమలు చేయాలి.**
**చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**



**మన ప్రజా ప్రతినిధి ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (సందెల రాజు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాస్ గడువును పెంచి బ్యాంక్ లింకెజ్ లేకుండా దరఖాస్తు దారులకు రుణాలు అందించాలని, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి లు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ లో డిబిఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ శాఖ గత 10 సంవత్సరాలుగా నిధులు విడుదల చేయకుండ, యాక్షన్ ప్లాన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఇపుడైన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని బ్యాంక్ లింకెజ్ లేకుండా చిత్తశుద్ధితో అమలు చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం దళిత బంధు స్థానంలో అంబేద్కర్ ఆభయాస్తం పథకాన్ని యుద్ధ ప్రాతి పదికన అమలు చేసి ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలను ఎటువంటి షరతులు లేకుండా అందించాలని చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షులు కొమ్ముల కరుణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, కిరణ్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**సిపిఐ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**



**మన ప్రజా ప్రతినిధి:** పెన్ పహాడ్ (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడేను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు బుధవారం నాడు ఆయన పెన్ పహాడ్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి జడ వెంకన్న ప్రజా నాట్య మండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపన భోయిన వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా నాయకుల గుండా రమేష్ తో కలిసి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో.... శ్రమకు తగ్గ ఫలితం దగ్గ ఫలితం దక్కాలని, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అమెరికా దేశంలోని చికాగో నగరంలో ఉద్యమించిన కార్మిక శక్తి ప్రపంచమంతా ఏకమై యాజమాన్య మెడలు వంచి రోజుకు 8 గంటల పని విధానాన్ని సాధించుకున్న గొప్ప రోజు మేడే అని కానీ నేటి పాలకులు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి మళ్ళీ 12 గంటల పని విధానం తీసుకువచ్చారని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికచట్టాలను కూల ద్రోసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల హక్కులను హరించి వేస్తున్న ఎన్డీఏ పాలకుల నిజస్వరూపాన్ని కార్మికుల లోకం యావత్తు గమనించి భవిష్యత్తులో వారికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని తగు సమయం వచ్చినప్పుడు తగు రీతిలో బుద్ధిచెప్పాలని ఆయన కార్మిక లోకానికి విజ్ఞప్తి చేశారు

# మాంసాహారంపై నిషేధం..శాకాహారానికే ఈ నగరాల్లో ప్రాధాన్యత ఎందుకు?

భారతదేశం, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు , ఆహారపు అలవాట్లకు నిలయం. ఇక్కడ, శాకాహారం , మాంసాహారం రెండూ సమానంగా ప్రాచుర్యం పొందాయి. ఆహారపు అలవాట్లు ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. చాలా మంది మాంసాహారులు ఉన్నప్పటికీ, కొన్ని నగరాలు శాంతి, మతపరమైన కారణాల వల్ల మాంసాహారాన్ని నిషేధించాయి. మరికొన్ని నగరాలు మాత్రం పాక్షికంగా నిషేధించాయి.మాంసాహార నిషేధం వెనుక కారణాలు: మాంసాహార నిషేధానికి ప్రధాన కారణం మతం , సంస్కృతి. జైన మతం , హిందూ మతం వంటి కొన్ని మతాలు అహింసను బోధిస్తాయి. ఈ మతాలను అనుసరిం చే వారు జంతువులను చంపడం లేదా మాంసం తినడం పాపం గా భావిస్తారు. ఈ కారణం వల్ల, కొన్ని నగరాలు,ముఖ్యంగా మతపరమైన ప్రాముఖ్యత కలిగిన నగరాలు మాంసాహారాన్ని నిషేధించాయి. కొన్నిచోట్లపండుగలు,ప్రత్యేక సందర్భాలలో మాంసాహారాన్ని నిషేధిస్తారు. ఇది మతపరమైన భావాలను గౌరవించడం.

వారణాసి, ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి హిందువులకు పవిత్రమైన నగరంగా పేరుగాంచింది. గంగానది ఒడ్డున వెలసిన ఈ నగరంలో అనేక దేవాలయాలు ఉన్నాయి. వారణాసిలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆలయాల సమీపంలో మాంసాహారాన్ని నిషేధించారు. విశ్వనాథ్ ఆలయం, దశాశ్వమేధ ఘాట్ వంటి ప్రదేశాల పరిసరాల్లో మాంసం అమ్మడం, తినడం చట్టవిరుద్ధం. మతపరమైన భావనలను గౌరవించడమే దీని ప్రధాన ఉద్దేశం. పండుగల సమయంలో ఈ నిషేధం మరింత కఠినంగా అమలు చేస్తారు. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాకుండా, కొన్ని నిర్దిష్ట ప్రదేశాల్లోనే ఈ నిషేధం ఉంటుంది. పర్యాటకులు, స్థానికులు ఈ నియమాన్ని గౌరవిస్తారు. హరిద్వార్, ఉత్తరాఖండ్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ కూడా హిందువులకు ముఖ్యమైన పుణ్యక్షేత్రం. కుంభమేళా వంటి పెద్ద పండుగలు ఇక్కడ జరుగుతాయి. హరిద్వార్‌లో మాంసాహారం అమ్మడం,తినడం పూర్తిగా నిషేధించారు. ఈ నగరం పవిత్రమైనదిగా భావించబడుతుంది, అందుకే ఇక్కడ మాంసం, మద్యం వంటి వాటిని నిషిద్ధం చేశారు. లక్షలాది మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. వారి మతపరమైన భావనలను గౌరవిస్తూ ఈ నిషేధం కొనసాగుతోంది.



హరిద్వార్‌లో కేవలం శాకాహార హొటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కనిపిస్తాయి. మాంసాహారం కోసం వెతికినా దొరకదు. ఇది ప్రభుత్వ నిబంధన, స్థానికులు కూడా దీనిని పాటిస్తారు.

రిషికేశ్, ఉత్తరాఖండ్: హరిద్వార్‌తో పాటు రిషికేశ్ కూడా ఉత్తరాఖండ్‌లో పవిత్ర నగరంగా గుర్తింపు పొందింది. యోగాకు, ఆధ్యాత్మిక చింతనకు రిషికేశ్ ప్రసిద్ధి. ఇక్కడ గంగానది స్వచ్ఛంగా ప్రవహిస్తుంది. రిషికేశ్‌లో కూడా మాంసాహారం పూర్తిగా నిషేధం. హరిద్వార్ మాదిరిగానే, రిషికేశ్ కూడా మతపరమైన ప్రాముఖ్యత కలిగిన ప్రదేశం కావడం వల్ల ఈ నిషేధం అమల్లో ఉంది. ఇక్కడకు వచ్చే యాత్రికులు, యోగా సాధకులు శాకాహార భోజనాన్ని ఎక్కువగా ఇష్టపడతారు. రిషికేశ్‌లో అనేక ఆశ్రమాలు, యోగా కేంద్రాలు ఉన్నాయి. వాటి చుట్టూ పూర్తిగా శాకాహార వాతావరణం ఉంటుంది.

పాలితానా, గుజరాత్: గుజరాత్‌లోని పాలితానా జైన మతస్తులకు అత్యంత పవిత్రమైన ప్రదేశం. ఇక్కడ శత్రుంజయ కొండపై వందలాది జైన దేవాలయాలు ఉన్నాయి. పాలితానా ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగా శాకాహార నగరంగా గుర్తింపు పొందింది. 2014లో ఇక్కడ మాంసాహారం అమ్మకం, వధించడం పూర్తిగా నిషేధించారు. జైన మతం అహింసను బోధిస్తుంది. అన్ని జీవుల పట్ల దయ కలిగి ఉండాలని చెబుతుంది. పాలితానాలో జంతువులను వధించడం కూడా నేరం. ఇక్కడ కనీసం గుడ్లు కూడా అమ్మరు. పాలితానాలో కేవలం శాకాహార భోజనం మాత్రమే లభిస్తుంది. ఈ నియమాన్ని స్థానికులు, పర్యాటకులు అందరూ తప్పకుండా పాటిస్తారు.

మైసూర్, కర్ణాటక : కర్ణాటకలోని మైసూర్ చారిత్రక నగరం. ఇక్కడ చాముండి కొండలు ప్రసిద్ధి. మైసూరులోని చాముండి కొండలు, నగరంలోని కొన్ని దేవాలయాల పరిసర ప్రాంతాల్లో మాంసాహారాన్ని నిషేధించారు. చాముండేశ్వరి దేవి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయ పరిసరాల్లో మాంసం అమ్మడం, తినడం నిషిద్ధం. పండుగలు, ప్రత్యేక దినాల్లో ఈ నియమాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారు. మైసూర్ నగరంలోని మిగతా ప్రాంతాల్లో మాంసాహారం లభిస్తుంది, కానీ పవిత్ర ప్రదేశాల్లో మాత్రం నిషేధం కొనసాగుతోంది. పుష్కర్, రాజస్థాన్: రాజస్థాన్‌లోని పుష్కర్ చిన్న పట్టణం, కానీ ఇది హిందువులకు ముఖ్యమైన తీర్థ స్థలం. ఇక్కడ బ్రహ్మదేవుడి ఆలయం ఉంది. పుష్కర్ సరస్సు చుట్టూ అనేక దేవాలయాలు ఉన్నాయి. పుష్కర్ పట్టణంలో మాంసాహారం అమ్మకం, తినడం నిషేధం. పుష్కర్ పవిత్రమైన ప్రదేశం కావడంతో ఈ నియమం అమల్లో ఉంది. ఇక్కడకు వచ్చే భక్తులు శాకాహార భోజనాన్ని స్వీకరిస్తారు. పుష్కర్‌లో చాలా వరకు రెస్టారెంట్లు శాకాహార వంటకాలను మాత్రమే అందిస్తాయి. పర్యాటకులు కూడా ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తారు.

మధుర, ఉత్తరప్రదేశ్ : ఉత్తరప్రదేశ్‌లోని మధుర శ్రీకృష్ణుడి జన్మస్థలంగా ప్రసిద్ధి. మధుర, వృందావనం హిందువులకు పవిత్రమైన నగరాలు. మధురలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా కృష్ణ జన్మభూమి, ద్వారకాధీష్ ఆలయం వంటి ప్రదేశాల చుట్టూ మాంసాహారాన్ని నిషేధించారు. మధురను పవిత్ర నగరంగా పరిగణించడం వల్ల ఈ నిషేధం కొనసాగుతోంది. పండుగలు, జన్మాష్టమి వంటి ప్రత్యేక సందర్భాల్లో ఈ నియమాలు మరింత కఠినంగా ఉంటాయి. మధుర నగరంలోని ఇతర ప్రాంతాల్లో మాంసాహారం అందుబాటులో ఉన్నప్పటికీ, పవిత్ర స్థలాల పరిసరాల్లో మాత్రం శాకాహారం మాత్రమే అనుమతిస్తారు. భారతదేశంలోని ఈ ప్రాంతాలలో మతపరమైన, సాంస్కృతిక కారణాల వల్ల మాంసాహారం నిషేధించబడింది. ఈ నియమాలు ఆయా ప్రాంతాల విశిష్టతను, సంప్రదాయాలను కాపాడుకోవడానికి సహాయపడతాయి. ఈ నగరాలను సందర్శించేటప్పుడు, ఈ నియమాలను గౌరవించడం ముఖ్యం.

# దేవునికి ఇష్టమైన ఈ పండు తింటే.. శరీరంలో సర్వ రోగాలు మాయం!

వేసవి కాలం వచ్చిందంటే చాలు, మార్కెట్లో రకరకాల పండ్లు దర్శనమిస్తాయి. మామిడి, పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! వీటిలో కొన్ని మనకు బాగా తెలిసినవి, కొన్ని అంతగా తెలియనివి. అలాంటి వాటిలో ఒకటి వెలగపండు. దేవాలయాల్లో దేవుళ్లకు ఈ పండును నైవేద్యంగా సమర్పిస్తారు. ముఖ్యంగా వినాయకచవితి వచ్చిందంటే చాలు.. గణనాథుడికి సమర్పిస్తాం. విఘ్నేశ్వరుడికి ఇది ఎంతో ఇష్టమైన పండు. అలాగే, ఆయుర్వేదం ప్రకారం, ఈ పండులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చూడటానికి బూడిద రంగులో గట్టిగా ఉండే ఈ పండు లోపల గుజ్జు మాత్రం తియ్యగా, పుల్లగా, వగరుగా కలిసిన రుచిని కలిగి ఉంటుంది. కొందరికి ఈ రుచి బాగా నచ్చుతుంది, కొందరికి అంతగా నచ్చకపోవచ్చు. కానీ రుచి ఎలా ఉన్నా, వెలగపండు ఆరోగ్యానికి మాత్రం ఎంతో మేలు చేస్తుంది. ఈ పండులో దాగున్న ప్రయోజనాలు తెలిస్తే, మీరు కూడా తప్పకుండా దీన్ని మీ ఆహారంలో చేర్చుకుంటారు. వెలగపండు – పోషకాల నిధి: వెలగపండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, పోషకాల గని కూడా. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, విటమిన్ బి కాంప్లెక్స్, పొటాషియం, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు ఇందులో సమృద్ధిగా లభిస్తాయి. ఈ పోషకాలన్నీ మన శరీరం ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో అవసరం. జీర్ణక్రియకు దివ్యౌషధం: వెలగపండు జీర్ణక్రియకు చాలా మంచిది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది, తద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు దూరమవుతాయి. విరేచనాలు, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడేవారికి వెలగపండు మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. వెలగపండును తరచూ తీసుకోవడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. శక్తిని పెంచే వెలగపండు: వెలగపండు తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఇందులో సహజ చక్కెరలు ఉంటాయి, ఇవి శరీరానికి త్వరగా



శక్తిని అందిస్తాయి. నీరసంగా, అలసటగా అనిపించినప్పుడు వెలగపండు తినడం వల్ల వెంటనే శక్తి లభిస్తుంది. వ్యాయామం చేసే ముందు లేదా తర్వాత వెలగపండు తినడం వల్ల అలసటను తగ్గించుకోవచ్చు. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: వెలగపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని తెల్ల రక్త కణాలను ఉత్తేజపరుస్తుంది, తద్వారా ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి వెలగపండు సహకరిస్తుంది. చర్మం– జుట్టు ఆరోగ్యానికి: వెలగపండు చర్మం , జుట్టు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి, తద్వారా చర్మం యవ్వనంగా, కాంతివంతంగా ఉంటుంది. మొటిమలు,మచ్చలు, ముడతలు వంటి చర్మ సమస్యలను తగ్గించడంలో వెలగపండు సహాయపడుతుంది. అలాగే, వెలగపండు జుట్టును బలంగా, ఆరోగ్యంగా ఉంచడానికి కూడా తోడ్పడుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గించి,జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణ: వెలగపండు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటుంది. మధుమేహంతో బాధపడుతున్న వారు వెలగపండును తీసుకోవడం వల్ల కొంతవరకు ప్రయోజనం పొందవచ్చు. అయితే, మధుమేహ రోగులు వెలగపండును తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: వెలగపండు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, కాలేయ పనితీరును మెరుగుపరచడానికి సహాయపడే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటుంది. కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు వెలగపండును తీసుకోవడం వల్ల కొంతవరకు ఉపశమనం పొందవచ్చు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: వెలగపండు రక్తపోటును తగ్గించడంలో,కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిలోని యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయి, ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. వెలగపండులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి, ఇవి శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీనిలోని పొటాషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరంలోని వివిధ విధులకు అవసరమైన పోషకాలను అందిస్తాయి. వెలగపండును ఎలా తీసుకోవాలి?వెలగపండును అనేక విధాలుగా తీసుకోవచ్చు. ఈ పండును పగలగొట్టి గుజ్జును నేరుగా తినవచ్చు. దీని రుచి కొంచెం పుల్లగా, తియ్యగా ఉంటుంది . అంతే కాకుండా ఈ పండు గుజ్జును నీటిలో కలిపి జ్యూస్ లాగా తయారుచేసుకొని తాగవచ్చు. ఇది వేసవిలో శరీరాన్ని చల్లబరుస్తుంది. వెలగపండుతో పచ్చడి కూడా చేసుకోవచ్చు. ఇది అన్నం, చపాతీ, ఇడ్లీ వంటి వాటితో చాలా రుచిగా ఉంటుంది ఈ పండు గుజ్జును పెరుగులో కలిపి రైతా తయారుచేసుకోవచ్చు. ఇది వేసవిలో చల్లగా,రుచిగా ఉంటుంది. వెలగపండు రుచి కొంచెం విభిన్నంగా ఉండవచ్చు కానీ దాని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమోఘం. ఈ వేసవిలో వెలగపండును తప్పకుండా మీ ఆహారంలో చేర్చుకోండిదాని ఆరోగ్య ప్రయోజనాలను పొందండి. మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇది ఒక రుచికరమైన, సహజమైన మార్గం.

# జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో లింగపాలెంకు చెందిన ఇడుపులపాటి నాగరాజు కు గోల్డ్ మెడల్



**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ ఏప్రిల్ 16:** ఈ నెల పదమూడవ తేదీ ఆదివారం జరిగిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన ఇడుపులపాటి మల్లయ్య,జగన కుమారి ల కుమారుడు ఇడుపులపాటి నాగరాజు సత్తుపల్లి పట్టణంలో ఉన్న స్థానిక జయశ్రీ జిమ్ తరపున పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 1 మరియు 3 ప్లేస్ లలో గోల్డ్ మెడల్ సాధించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ ఛాంపియన్ షిప్ నుండి స్టేట్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ కు సెలెక్ట్ ఐనందుకు లింగపాలెం గ్రామానికి చెందిన పెద్దలు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మరియు జయశ్రీ జిమ్ కోచ్ జొన్నలగడ్డ శ్రీకాంత్ తదితరులు ఇడుపులపాటి నాగరాజు కు అభినందనలు తెలిపారు.

# గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, 16:** చేగుంట మండలం చందాయి పెట్ గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఐకెపి కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐ కే పి సిబ్బంది మాట్లాడుతూ, ధాన్య కొనుగోలు కేంద్రాన్ని గ్రామంలో ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని,ధాన్యాన్ని శుభ్రంగా తాలు లేకుండా చేసి 17% తేమ ఉండేటట్లుగా చేసుకొని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులను కోరారు, ప్రభుత్వం ప్రకటించిన 500,రూపాయలు బోనస్ ప్రతి రైతు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సి ఏ అవుబోతు స్వామి యాదవ్, ఎర్ర కవిత,, ఐకేపీ కమిటీ మెంబెర్స్ బుద్ద సంతోష, శిలా విరమణి,బాస రాజు,దప్పు కుమార్,బజారు స్వామి గౌడ్, ఆనందాస్ ఆంజనేయులు, దండు యాదగిరి, అయిండ్ల రమేష్, ఎర్ర గొల్ల మధు , జూగంటి శోభన్, బాలమల్లు,అవుబోతు రవి,ఎర్రగుళ్ల ఆంజనేయులు,నిరుడి ప్రవీణ్, నవీన్, రాంచంద్రం,తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ కార్డియాలాజిస్ట్ రాపోలు కరుణాకర్ జన్మదిన వేడుకలు



**నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):** ప్రజలకు ఎన్నెన్నో సేవలు చేస్తున్న ప్రముఖ కార్డియాలాజిస్ట్ ఐకాన్ అఫ్ హెల్త్ కేర్ అవార్డు గ్రహీత రాపోలు కరుణాకర్ జన్మదిన వేడుకలు నేరేడుచర్ల పీహెచ్సి నందు ఇన్పేషంట్ లకు పండ్లు పంపిణి చేసి కేక్ కట్ చేయడం జరిగింది ఈ సందర్భంగా బిఆర్ యస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ వైద్యం అంటే ఒక వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తి గా ప్రజలకు ఎన్నెన్నో సేవలు చేస్తున్న డాక్టర్ కరుణాకర్ ఎంతోమంది హృదయాలను వెలిగిస్తునటువంటి సేవ దృక్పథం కలిగినటువంటి వ్యక్తి అని తాను మరెన్నో పుట్టినరోజు జరుపుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వైద్యఅధికారి పున్న నాగిని,షిరిడీ సాయి సేవ ఆశ్రమం చైర్మన్ దేవరశెట్టి వెంకన్న, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జీలకర్ర రామస్వామి, సామాజిక కార్యకర్త తకెళ్ళనాగార్జున, బచ్చలకూరి శ్రీనివాస్ (డాల్ఫిన్) నేరేడుచర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొప్పు రామకృష్ణ, దిరావత్ శివనాయక్ తదితరులుపాల్గొన్నారు

# మహిళ' అంటే అసలైన అర్థం ఇదే .. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

'మహిళ' అనే పదానికి అర్థం ఏంటో యూకేలోని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 'మహిళ'అంటే చట్టపరంగా ఇదే అర్థం వస్తుందని పేర్కొంది. ఒక మహిళను చట్టపరంగా ఎలా నిర్వచించాలన్న దానిపై యూకే సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అమ్మాయిలుగా పుట్టినవారికి మాత్రమే చట్టప్రకారం, లింగపరంగా మహిళల గుర్తింపు దక్కుతుందని యూకే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. స్కాట్ లాండ్ ప్రభుత్వం VS ఓ మహిళా గ్రూప్ కేసులో భాగంగా యూకేలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పును వెల్లడించింది. ఎన్నో ఏళ్లపాటు సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత ఈ తీర్పు వెల్లడైంది. సమానత్వ చట్టం–2010 ప్రకారం 'స్త్రీ' 'లింగం' అనే పదాలు పుట్టుకతో అమ్మాయిలుగా పుట్టినవారిని, పుట్టుకతో ఏ లింగానికి చెందినవారు అన్న విషయాలను మాత్రమే సూచిస్తాయని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. లింగమార్పిడి చేయించుకున్నంత మాత్రాన మహిళ కాదని ఈ మేరకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లింగ గుర్తింపు సర్టిఫికెట్(జీఆర్‌సీ)తో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు లింగ ఆధారిత రక్షణ హక్కు కలిగి ఉంటారని స్కాట్ లాండ్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే, ట్రాన్స్ జెండర్ లకు రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి లార్డ్ హొడ్జ్ తెలిపారు. 'లింగం' అనే పదం అర్థాన్ని లండన్ కోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో వెల్లడించారు. పుట్టుకతో వచ్చే లింగం గుర్తింపా? లేక 2004 లింగ గుర్తింపు చట్టం ప్రకారం లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులు పొందే సర్టిఫికెట్ ఆధారంగా లభించే న్యాయపరమైన గుర్తింపా? అన్నది సుప్రీంకోర్టు తేల్చింది. ట్రాన్స్ జెండర్ వ్యక్తుల (లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులు) విషయంలో ఈ తీర్పు స్పష్టతనిచ్చింది. ఒకే లింగానికే(ఆడ లేదా మగ) చెందిన స్థలాలు, సేవలు, సమాన వేతనాలు, ప్రసూతి విధానం, క్రీడా కార్యక్రమాలు వంటివాటిపై ఈ తీర్పు ప్రభావం చూపొచ్చని నిపుణులు అంటున్నారు.

# కంట్లో పదునైన నొప్పి.. కారణాలివే కావచ్చు.. నిర్లక్ష్యం చెయ్యొద్దు!

తీవ్రమైన కంటి నొప్పి వెనుక కారణం ఇదే కావచ్చు కొన్ని రకాల తలనొప్పులు కూడా విపరీతమైన కంటి నొప్పికి కారణమవుతాయి. అందులో క్లస్టర్ తలనొప్పి ఒకటి. కంట్లో విపరీతమైన నొప్పికి క్లస్టర్ తలనొప్పి కూడా కారణం కావచ్చు. సైనస్ తలనొప్పి, మైగ్రేన్ తలనొప్పి, హైపర్ టెన్షన్ తో వచ్చే తలనొప్పి ఇలా రకరకాల తలనొప్పులు కూడా కంటిపైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ తలనొప్పుల కారణంగా కూడా కన్ను చుట్టూ, కన్ను వెనక కేంద్రీకృతమై ఉన్న భాగం ప్రభావితం అవుతుంది.క్లస్టర్ తలనొప్పి ప్రభావం కళ్ళపైన తీవ్రమైన బాధాకరమైన నొప్పి పదునైన కత్తిపోటు లాగా అనిపిస్తుంది. కొంతమందిలో ఇది నెలలు, సంవత్సరాల పాటు కూడా కొనసాగుతుంది.ఈ క్లస్టర్ తలనొప్పిని అసలు నిర్లక్ష్యం చేయకూడదు. క్లస్టర్ తలనొప్పి ప్రతిరోజు ఖచ్చితమైన సమయంలోనే వస్తుంది. ఈ తలనొప్పితో సరిగ్గా నిద్ర కూడా పట్టదు. నిద్ర భంగం అవుతూ ఉంటుంది. క్లస్టర్ తలనొప్పి వచ్చినవారికి కళ్ళ పైన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కళ్ళలో ఈ లక్షణాలు ఉంటే క్లస్టర్ తలనొప్పి కావచ్చు కళ్ళు వాపు రావడం,కళ్ళు ఎర్రబడడం, రెప్పలు వాలిపోవడం,నీరు కారడం,ముక్కు కారడం, చెమటలు పట్టడం,ముఖం ఎర్రబడడం వంటి అనేకలక్షణాలు క్లస్టర్ తలనొప్పి కారణంగా కనిపిస్తాయి